క్లుప్తంగా

2న రైతుబజారులో ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరులోని ఆర్టీసీ బస్టాండ్ రైతు బజారులో ఆదివారం ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు కన్స్యూమర్ కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టరు జాతీయ ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు తెలిపారు. రైతు బజారు ఆవరణలో ఈ-శ్రమ్ కార్డ్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతు బజారులో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ కార్డును పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్డు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత పథకం కింద అమలు చేసే ప్రతి పయోజనం ఈ-శ్రమ్ కార్డుదారుడు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చేకూరి రాజశేఖర్, షేక్ మాబు సుభాని, షేక్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పట్నంబజార్: బక్రీదు పండుగను పురస్కరించుకుని డెప్యూటీ మేయర్ షేక్ సజీల గురువారం మాయాబజార్‌లోని తన కార్యాలయంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, ఖలీల్, చాంద్ పాల్గొన్నారు.

నాటా సభలకు విజయలక్ష్మి



నగరంపాలెం: అమెరికాలోని డల్లాస్ నగరంలో ఈనెల 30 నుంచి జులై మూడు వరకు నిర్వహించనున్న ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) సభల్లో పాల్గొనాలని నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందినట్లు ఏపీ స్టేట్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఆహ్వానం పంపిన నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాగ్‌లో ఆభరణాల చోరీ

పట్నంబజార్: బ్యాగ్‌లో ఆభరణాలు చోరీకి గురైన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన రేవతి కుటుంబంతో కలసి బెంగళూరు నుంచి వయా గుంటూరు మీదుగా బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు కాకాని రోడ్డులోకి రాగానే బ్యాగ్ కత్తిరించి ఉండటాన్ని గమనించారు. అందులోని 130 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ ఏజెన్సీ మోసం

గుంటూరు ఈస్ట్: ట్రావెల్ ఏజెన్సీ మోసం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. హెర్బల్ లైఫ్‌లో సీనియర్ వెల్‌నెస్ కోచ్‌గా పనిచేసే వేముల రమాదేవి ఈ నెల 21న కుందుల రోడ్డులోని చైతన్య హ్యాపీ ట్రిప్స్ ట్రావెల్ ఏజెన్సీకి వెళ్లారు. కంపెనీ సభ్యులు 40 మంది బెంగుళూరు వెళ్లేందుకు చార్జీల కింద రూ. 2,15,000ను ఉషారాణి అకౌంట్‌కు చెల్లించారు. అయితే, ట్రావెల్ ఏజెన్సీ బస్సు ఏర్పాటు చేయలేదు. రమాదేవి డబ్బులు అడగ్గా, ఏజెన్సీ నిర్వాహకులైన పవన్‌కుమార్, ఉషారాణి, దొరబాబు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించి దుర్భాషలాడి బెదిరించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యం

బాలుడి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రత్నగిరి కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలుడు బుధవారం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

భర్త కార్యాలయంపై భార్య దాడి

మహిళ అనుచరులతో వెళ్లి భర్త ఆఫీసు తాళాలు పగులగొట్టి నగదు, పత్రాలు తీసుకు వెళ్లిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కన్నావారితోటలోని భర్త అమృతలూరి వెంకటేశ్వరరావు కార్యాలయానికి గీతిక అనుచరులతో బుధవారం వెళ్లి తాళాలు పగులగొట్టింది. కార్యాలయంలోని రూ. 2 లక్షలతో పాటు విలువైన పత్రాలు ఎత్తుకు వెళ్లింది. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను బెదిరించిన ఘటనపై కేసు నమోదు

నగ్న చిత్రాలు సోషల్ మీడియాలో పెడతానని భర్త బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌లో నివసించే ఏ.వెంకటేశ్వరరావు తన భార్య గీతిక నగ్న చిత్రాలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువులోని అత్తామామ ఇంట్లో నూతలపాటి ప్రతాప్ (36) నివసిస్తుంటాడు. సీసీ కెమెరాల రిపేరు నిమిత్తం శ్రీనగర్‌లోని ఆరో లైన్‌లోని గదిలో ఉంటున్నాడు. గదిలో గురువారం ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు కారణంగా మానసికంగా కృంగి, ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలైనులో భక్తులు



వేంకటేశ్వరస్వామికి పూజలు

నగరంపాలెం: నగరంలో తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవాలయాల్లో స్వామికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు జరిపారు. ఆలయాల్ని మంగళ తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాద వితరణ చేశారు.



సంపత్‌నగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలైనులో భక్తులు



ప్రసాదంగా పేల పిండిని భక్తులకు అందజేస్తున్న ఆలయ సిబ్బంది



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అరండల్‌పేట శ్రీమోహన రంగనాయకస్వామి ఆలయంలో స్వామి

మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసు బందోబస్తు



ప్రార్థన స్థలం వద్ద పోలీసుల పహారా

నగరంపాలెం: బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం జిల్లా పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్టమైన భద్రత చర్యల్ని చేపట్టారు. ప్రార్థనలకు అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ విధులు నిర్వహించారు.

4,564 కేసులు నమోదు

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని గుర్తించేందుకు గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. బహిరంగంగా మద్యం తాగే 4,836 మందిపై 4,564 కేసులు నమోదు చేశారు. మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని, కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందని హితబోధ చేశారు.

పోలీసులు నిజాయతీగా ఉండాలి

జిల్లాలోని పోలీస్ యంత్రాంగం విధి నిర్వహణలో నిజాయతీగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి ఆరోపణలకు అవకాశం లేకుండా జవాబుదారీతనంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. అందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ములాయం సింగ్ విగ్రహావిష్కరణ సభకు తరలిరండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బృంద సభ్యులు

నడింపాలెం (ప్రత్తిపాడు): ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ సభకు అధిక సంఖ్యలో అభిమానులు తరలి రావాలని సోషలిస్ట్ థింకర్స్ ఫోరం టీం సభ్యులు తాటి సత్యనారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. నడింపాలెంలో గురువారం రాత్రి ఇందుకు సంబంధించిన 'మన సభ మన కోసం' వాల్ పోస్టర్లను స్థానికులతో కలిసి ఫోరం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 9న పెదకాకాని టోల్ ప్లాజా సమీపంలో, ఏఎన్‌యూ ఎదురునున్న మైదానంలో జరగనున్న విగ్రహావిష్కరణ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతురాజు లక్ష్మీనారాయణ, మద్దుల లక్ష్మీనారాయణ, సీహెచ్ లింగారావు, సూర్యబాలాజి తదితరులు పాల్గొన్నారు.

నీట్–పీజీ ఎంట్రన్స్‌లో గుణవర్ధనరెడ్డికి ర్యాంకు



తల్లిదండ్రులతో గుణవర్ధనరెడ్డి

తెనాలి: తమ వంశంలో ఎవరూ డాక్టర్లు లేరు... తమ ఏకైక బిడ్డ డాక్టరు కావాలనేది ఆ దంపతుల ఆకాంక్ష...చిన్నతనం నుంచీ ఆ కొడుకు చదువులో చక్కగా రాణిస్తుండటం కూడా వారికి ఆశల్ని రేకెత్తించింది. చదువుకు ఆటంకం కారాదని పల్లెటూరు నుంచి పట్టణానికి మకాం మార్చారు. తల్లిదండ్రుల కోరిక ప్రకారం ఎంబీబీఎస్ చేయడమే కాకుండా నీట్-పీజీ ఎంట్రెన్స్‌లోనూ జాతీయస్థాయిలో ర్యాంకు సాధించాడా కుర్రోడు...పెద్దల కలల్ని సాకారం చేశాడు. ఆ వివరాలివి. అవుతు వెంకటరెడ్డి-హరిత దంపతులది తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం చివలూరు. కొద్దిపాటి వ్యవసాయమే వారి జీవనోపాధి. ఏకైక కుమారుడు గుణవర్ధనరెడ్డిని చక్కగా చదివించాలని తలపోశారు. గ్రామంలో ఉంటే కొడుకు చదువుకు ఆటంకమని తెనాలికి వచ్చేశారు. పట్టణంలో ఉంటూ గ్రామంలో వ్యవసాయం చూసుకుంటున్నారు. కొడుకును మంచి పాఠశాలలో చదివించసాగారు. అనుకున్నట్టే చక్కగా చదువుతూ వచ్చిన గుణవర్ధనరెడ్డిని డాక్టరును చేయాలని ఆశించారు.విజయవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ గ్రూపులో చేర్పించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణుడైన గుణవర్ధనరెడ్డి, నీట్ పరీక్షల్లో స్టేట్ 172వ ర్యాంకును సాధించాడు. తమ కల నెరవేరిందన్న సంతోషం ఆ పెద్దలది. గుంటూరు మెడికల్ కాలేజీలో 2017–2023లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక పీజీ చేయాలన్న భావనతో నీట్-పీజీ ఎంట్రెన్స్‌ను గత మార్చిలో రాశాడు. ఈనెల 14న వచ్చిన ఫలితాల్లో మొత్తం జాతీయస్థాయిలో 158వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రుల కలల్ని మించి సాధించిన కొడుకును చూసి వెంకటరెడ్డి, హరిత దంపతులు ఆనందపడుతున్నారు. ఎండీ జనరల్ మెడిసిన్ చదువుతానని, తర్వాత సూపర్ స్పెషాలిటీలో ఎండీ కార్డియాలజీ చేయాలనేది తన ఆశయంగా గుణవర్ధనరెడ్డి 'సాక్షి'తో చెప్పారు. ఆల్ ది బెస్ట్ చెబుదాం.

అలరించిన బ్రహ్మంగారి నాటకం



కళాకారులకు సత్కారం

నగరంపాలెం: భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటికను ప్రదర్శించారు. పలువురు పాత్రధారుల నటన ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణమూర్తి, విశ్వకర్మ సంఘ సభ్యులు తుర్లపాటి శంభయాచారి, ఈశ్వరచారి, కాజ భరద్వాజ, మేడూరి ప్రసాదరావు పాల్గొన్నారు. చివరగా కళాకారుల్ని కళా సేవారత్న అవార్డులతో సత్కరించారు.

యువతికి వేధింపులు.. యువకుడిపై కేసు నమోదు

పెదనందిపాడు: యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి, వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పెదనందిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్ర గురువారం తెలిపారు. పెదనందిపాడుకు చెందిన యువతిని అదే గ్రామానికి ప్రవీణ్ ఆమెకు దగ్గరగా ఉంటూనే ఇబ్బందులకు గురిచేశాడు. ఇది గమనించిన యువతి యువకుడిని దూరం పెడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఇద్దరు కలసి తీసుకున్న ఫొటోలను చూపించి, బ్లాక్‌మెయిల్ చేయడంతో భయపడిన యువతి దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. దిశ టీం సభ్యులు, స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. యువతి పిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మహిళలను వేధింపులకు గురిచేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దిశ, స్థానిక పోలీసులు హెచ్చరించారు.

వేదలకు బియ్యం పంపిణీ



గుంటూరు రూరల్: న్యూ జియోన్ మిషన్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్‌కే కృపాకర్ గురువారం వెంగళాయపాలెం గ్రామంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. పది మంది పేదలకు పది కిలోల చొప్పున బియ్యం అందించారు. సొసైటీ సెక్రటరీ కె.కిషోర్, జాయింట్ సెక్రటరీ ఉద్దగిరి సాయిదుర్గా పాల్గొన్నారు.

షార్‌ను సందర్శించిన చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ సభ్యులు



షార్‌లోని వెహికల్ లాంచింగ్ ప్యాడ్ వద్ద నందమూరి లక్ష్మీపార్వతితో శాంతమూర్తి, సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 28న తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) ను సందర్శించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ సందర్శనకు చిల్డ్రన్ స్పేస్ క్లబ్ బృందంతో పాటు రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షార్‌లోని రాకెట్ ప్రయోగ వేదికను సందర్శించిన తాము అద్భుతమైన అనుభూతికి లోనైనట్లు తెలిపారు. శాస్త్రవేత్తల కృషి, పట్టుదలతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రపంచంలోనే అగ్రభాగాన నిలిచిందని, శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు అంతరిక్ష పరిశోధనపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ద్వారా ఏడు వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు షార్‌ను సందర్శించారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షార్ పర్యటనలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపై ఇంటింటికీ ప్రచారం



గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నేతలు ప్రచారం చేశారు. స్థానిక బ్రాడీపేటలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీతో పాటు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం బీజేపీ అంకితభావంతో పని చేస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి ధన్ యోజన, ప్రధాన మంత్రి స్వనిధి, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఆహార భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, రైతులకు చేయూత వంటి కేంద్ర పథకాల గురించి స్థానికులకు వివరించారు. మోదీకి మద్దతుగా నిలిచేందుకు 9090902024కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ, నేతలు పాలపాటి రవికుమార్, సోలంకి హేమంత్, ఈమని మాధవరెడ్డి, వెలగలేటి గంగాధర్, అప్పిశెట్టి రంగారావు, నాదెండ్ల రమేష్, జయకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతాలు





ప్రత్యేక అలంకరణలో సాయిబాబా వ్రతంలో పాల్గొన్న మహిళలు

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీ సాయినాథ సన్నిధానంలో గురు పూర్ణిమ మహోత్సవాలు గురువారం మూడో రోజుకి చేరాయి. శ్రీసాయి సత్య వ్రతాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాయినాథుడికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, అవుల అప్పారావు, సుధీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత సిద్ధంకావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నగరంపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుక ఉన్న మతోన్మాద ఆర్ఎస్ఎస్ దేశాన్ని తిరోగమనంలో నడిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏపీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాజగారితోట శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా గురువారం 'భారత దేశ రాజకీయాలు- యువత పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అనైతిక పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత మిలిటెంట్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కామన్ సివిల్ కోడ్ రావాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే కామన్ సివిల్ కోడ్ తీసుకొస్తుందని ఆరోపించారు. ఐపీసీ అందరికీ సమానంగా ఉంటుందని, సివిల్ అంశాలు ఎవరి మతానికి సంబంధించి వారికి వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. కామన్ సివిల్ కోడ్‌తో మతాలు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ కోసం గుంటూరు నుంచి అమృతరావు ఉద్యమం చేపట్టారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్ననే ప్రజలు కోరుకుంటున్నారు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్

తాడికొండ: సుపుత్రుడిపై నమ్మకం లేకనే చంద్రబాబు దత్తపుత్రుడికి ప్యాకేజీలిచ్చి రోడ్లపై తిప్పి ప్రజలను రెచ్చగొడుతున్నాడని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పని పూర్తిగా అయిపోయిందని గమనించిన చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అక్రమంగా సంపాదించిన సొమ్మును వెదజల్లి ప్రజలను నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నాడన్నారు. లోకేష్ యాత్రలు హాస్యాస్పదంగా కొనసాగుతున్నాయని, తెలుగు మాట్లాడటం చదవడం రాని లోకేష్, పవన్‌కల్యాణ్‌లు వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేదు కానీ సీఎం హోదాలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మంచిది కాదన్నారు. చంద్రబాబు సృష్టించిన కల్యాణ్‌లు ఎంతమంది వచ్చినా రాష్ట్రంలో మరో 30 సంవత్సరాలు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. రాజకీయం అంటే రెండున్నర గంటల సినిమా అనుకొని పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్న ప్యాకేజీ స్టార్ రాబోయే ఎన్నికల్లో తట్టబుట్టా సర్దుకొని వెళ్లడం ఖాయమన్నారు. జగనన్న సురక్ష పథకంతో నూరుశాతం సంక్షేమం ప్రతి పేదవాడికీ అందుతుందని, రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175/175 స్థానాల్లో విజయం సాధించి దుష్టచతుష్టయాన్ని తరిమి కొట్టడం ఖాయమని పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ వివరాల మేరకు.. పెదపలకలూరు గ్రామానికి చెందిన షేక్ సుబాని ద్విచక్ర వాహనంపై తురకపాలెం వెళుతున్నాడు. శ్యామలానగర్‌కు చెందిన చింతల శ్యామ్ ద్విచక్ర వాహనంపై పలకలూరుకు వెళుతున్నాడు. తురకపాలెం వద్ద ఇద్దరి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఇద్దరిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాలు, మసీదుల్లో ముస్లింల ప్రార్థనలు
- హాజరైన ప్రజాప్రతినిధులు



నగరంపాలెం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



ముస్లిం కళాశాల ఈద్గా వద్ద దువా చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

లక్ష్మీపురం: త్యాగానికి ప్రతీక అయిన బక్రీదు పండుగను నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ఉదయం ప్రత్యేక ప్రార్థనల(నమాజ్)ను నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంపాలెం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ముస్లిం కళాశాల ఈద్గాలో ప్రార్థనల్లో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మహ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. ఈద్ ముబారక్ తెలియజేశారు. ప్రార్థనల్లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు ఎస్.ఎస్. జియావుద్దీన్, అజుమాన్ కమిటీ అధ్యక్షుడు కర్నుమా, తూర్పు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు మస్తాన్ వలి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.